# పేపర్ అండర్ కన్సిడరేషన్

ఎమ్మెస్సార్ మూర్తి

అనగా...అనగా... గుర్రపునాడా ఆకారంలో ఉన్న ఓ ఆఫీసు. ఆరే అంతస్థులున్న ఆ ఆఫీసులో, అయస్కాంతాల్లాంటి అమ్మాయిలు, ఐరన్ స్ట్రైంగ్స్‌లో ఉన్న అబ్బాయిలు ఉన్నారు.

స్టెయిన్‌లెస్ స్టీల్లా మెరిసిపోయే సంసారులు, అపరంజి వర్ఛస్సులో ఉన్న ఆఫీసర్లుకూడ ఉండడం చేత, ఆ ఆఫీసు పనులు అత్తెసరులా ఆలసత్వంతో కూచోడంలేదు. ప్రెషర్‌కుక్కర్లోలాగ ఉడికి, ఊరుకుంటున్నాయి.

ఇటీవలే—అయిదో అంతస్థులో - అల్లా దక్షిణం వేపు మూలనున్న సెషన్లో ఓ కొత్తావిడ 'జాయినింగ్ రిపోర్ట్' ఇచ్చింది.

ఆవిడ తనపేరు యు. యన్. చారి - అని అదే రోజున అటెండెన్సు రిజస్టర్లోరానీ సంతకం పెట్టింది.

*  *  *

అంతవరకూ, 'కో ఎడ్యుకేషన్' తో 'ఇంగ్లీషు మీడియంలో'నే నడిచిన చారి, ఆ ఆఫీసులో అడుగెట్ట బోయేముందు కేరింతలు కొట్టింది.

తీరా ఓ వారం తిరగకముందే, ఆ ఆఫీసొక బోరింగై కూచుంది.

ఆఫీసుగోడల అవతలున్న సకల వ్యాపారాలూ అక్కడున్నా, ఆడవాళ్ళూ మగవాళ్ళు అసలు పలుక్కోరు.

అమ్మాయిలకి బాయ్‌ఫ్రెండ్స్‌లేరు. అబ్బాయిలు అగ్నిపుత్రుల్లా అన్నమానం మండుతూనే ఉంటారు.

ఎబ్బెబ్బే... ఏం ఆఫీసిది? – ఓ ముద్దూ ముచ్చటా లేదే...అధవా, ఆలూ మగలూ అక్కడక్కడా ఉన్నారుగదా! ఆఫీసవర్స్‌లో ఆగర్భ శత్రువుల్లా ఉండి, తీరా అయిదయిందే - సంధి చేసుకున్న సామంతరాజుల్లా ఒదిగి, ఒకే స్కూటరు రథంమీద, ఒకే ఉరుకు. వర్కింగ్ అవర్స్‌లో ఏమాత్రం తలెత్తరు. ప్రపంచానికి రాబోయే ప్రాబ్లమ్ తమ నెత్తిమీద పడబోతున్నంత భయంతో - ఫైళ్ళలోనే కళ్ళు డీసెల్ రైళ్ళలా పరుగెత్తించడం. ఏదైనా అడిగితే సిగ్నల్ రెక్కల్లా మెడఎత్తడం.

చారికి, ఆ ఆఫీసుధోరణి ససేమిరా నచ్చలేదు.

ఈ ఆఫీసు అంతేమిటో చూడాలి!

ఈ "రాతియుగం" మనుషులకి నాగరికత 'ఇది' అని ఎత్తి చూపించాలి.

ఎలా?! ?!

ఆడవాళ్ళని చూద్దామా-అల్లవే గొడవలు.

'మీ లంగా లేసులు లకడీకాపూల్లోనేగా కొంటా'

'ఆవిడ రింగుల్లోని తెల్లరాళ్ళు ముత్యాల్లా లేవూ!'

'ఫలానాఫీసావిడ లిప్‌స్టిక్ - పావు కిలో మీటరు మేరకు పరిమళం ఇస్తోంది'

"పే కమీషను ఇంకా పేపర్లో పడదే?"

ఇవీ కబుర్లు.

ఇక మగవాళ్ళో...

సైకిళ్ళు స్టాండులో పెట్టడం, సెషనుకి రావడం. కొంపలంటుకు పోతున్నంత సీరియస్‌గా బిరకటం. లంచవర్లో చెట్టుకింద గుంపులు గుంపులుగా చేరి ఏదో చెప్పుకోటం. సిద్ధిపొందిన బోధిసత్త్వుల్లా మళ్ళా

సెక్షన్లో చేరడం, ఆ సాయంత్రం, అడిగే వాళ్ళుంటే ఇంటికి, లేపోతే క్లబ్బు.

అఫ్‌కోర్స్... ఆ ఆఫీసులో అందరూ అంత వర్క్ మైండెడ్ కావడానికి కొన్ని యావత్ (కార్యా. లయ) జీవిత నదుపాయాలున్నాయి.

"అర్ధాయుష్మాన్‌భవః" (చేరిన మూడేళ్ళగ్గానీ తీరిగ్గా దీవించరు) అనే ఆశీస్సు అయిదువేల దాకా అప్పు పుట్టిస్తుంది. సులభ వాయిదాలలో ప్రతి నెలా కష్టం కల్గించేట్టు పేలో కట్ ఉంటుంది. అంతగా అమాంతం అప్పు కావలని వస్తే, ఆ ప్రాంతాల్లోనే జనంలేని గారడీ వాళ్లుంటారు. (అప్పుడప్పుడూ ఆఫీసులోనే హస్త లాఘవాలు లేకపోలేదు.)

అడపా దడపా... ఆడవాళ్ళకి మగవాళ్ళకీ కావలసిన నిత్యావసర వస్తువులు - కళ్ళజోళ్ళ దగ్గర్నుంచీ కట్నేసుల్దాకా... ఈజీ ఇన్‌స్టాల్‌మెంట్లో ఇచ్చే కారోళ్ళన్మఖులున్నారు.

చిట్లున్నాయి. బీట్లాటలున్నాయి.

చందాలున్నాయి, నమూజాలున్నాయి.

చదువుకున్న రోజులు సాంవత్సరీకాల్లా వెంట బడుతున్నాయి. అంటే ఇంకా ఇక్కడ కొన్ని పరీక్షలున్నాయి. అవి పాసయినా ప్రమోషనుగాని సూచనలు బోలెడున్నాయి.

ఆడవాళ్ళ కలాల్నుంచి వెలువడ్డ సీరియల్ నవలా స్రావాల్ని అందంగా బైండుచేసి అద్దెకిచ్చే షాపులు పక్కవీధిలోనే ఉన్నాయి.

ఆకలే కావాలిగాని, అల్పాహార నదుపాయాలు చౌగ్గానే ఉన్నాయి.

ఇవన్నీ కొనసాగని క్షణం ఏదైనా వస్తే...

'విక్టిమైజేషన్... డౌన్ డౌన్'

అందేత అదో ప్రత్యేక ప్రపంచంలా తయారయింది.

* * *

వాటర్‌క్లోజెట్‌లో, తన అందం, ఆవెడల్పాంటి బెల్జియం అద్దాన్ని పగలగొట్టేస్తుందేమో ననుకుంటూ, ఆవేళకి ఆరోసారి తన వంపుసొంపుల సోయగాన్ని చూసుకొంటోంది చారి.

'ప్చ్... లాభంలేదు, తన అందం ఎవర్నీ ఆకర్షించడంలేదు.

ఏ వెధవా తలెత్తి చూడ్డంలేదు, అసలు వాళ్ళు మగాళ్ళో, మూసపోసిన జడపదార్థాలో అర్థం కావడం లేదు.

కాలేజీలో తన అందం చూసి... 'చారీ... నా మానస చోరీ' అని విలపించేవాళ్ళు!

తను వయ్యారంగా, ఆడపిల్లలందరిలోనూ ఒరుసుకుంటూ నడుస్తుంటే, ఎదురొచ్చే కుర్రకారు.

'యునైటెడ్ నేషన్స్-పార్ట్‌వన్' అనీ

తనని దాటాక - తనవెనక

''పార్ట్ టూ'' అని అనేవాళ్లు.

అబ్బ!! తలుచుకుంటుంటే ఒళ్ళు పులకరిస్తోంది.

ఇక లాభంలేదు. విప్లవం లేవ దీయాల్సిందే— అనుకుంది ఆఖరిసారి.

యూ. ఎన్. చారి లేవదీసిన విప్లవానికి వారం తిరక్కముందే రెస్పాన్స్ వచ్చేసింది.

నడకలో—ఆవిడ జూపిన 'న్యూవేవ్' లో చాల మంది పడి ఊపిరాడక చావబోయారు.

అవి జరిగాయి. ఇవి జరిగాయి.

ఏవేవో జరిగాయి.

తను తెచ్చిన ఈ విప్లవానికి చారి గర్వపడింది.

రేపో మాపో విజయదుందుభి మోగుతుందిగదా అని ఆవేల్టితో తన విప్లవాన్ని ఆపింది.

ఆ వారంరోజులూ, ఆ కాంపస్‌లో పికెటింగ్ చేస్తున్న మన్మథ దంపతులు-శనివారం సాయంత్రానికి కాంప్ ఎత్తేశారు.

* * *

ఆ ఆదివారం, అనక న్నాళ్లోజుల సెలవల్లో మళ్ళీ ఆఫీసు మామూలుపరిస్థితికి దిగజారింది. ప్రజలు పోయినవారంలో పోయిన పోకడలే మర్చిపోయారు. అయినా వాటి జ్ఞాపకాలు రహస్యసమావేశాల్లో గుసగుసల్లో చెప్పుకుంటున్నారు. ఇవన్నీ చారికి ఆశ్చర్యం కల్గించలేదు. తనూహించినవేఅవి. కాని తనకి అపజయం కలిగింది. తీరనిఅపజయం. ఇంత విప్లవ నాయకురాలిగా వినుతికెక్కిన తనని ఎవడూచూడడం లేదు, కనీసం—హవ్వ!—ఓరకంటనైనా.

తనపేరు చారికదా! దానికి మూలమేమిటన్న విచారమేలేదు.

చారి ఓనిర్ణయానికి వచ్చింది. "ఈ మూగ ఉనంతో ఇకలాభంలేదు. మూకుమ్మడిగా చావనీ — ఐ కేర్ ది లీస్ట్-నాకెందుకు నాకుమాత్రం ఓతృప్తి లభించింది."

కానీ తన హృదయంలో ఓమూల అసంతృప్తి మూలుగుతూనే ఉందని తెలీదు.

ఒకనాటి ఉత్తరార్ధంలో, ఆవిడకి ఉత్తరధృవం వేపు సెక్షన్‌కి ట్రాన్స్ఫరయింది.

*  *  *

ఓనెల,... నెలాన్నర గడిచింది.

సెక్షన్లో విషయాలు తను గమనిస్తోంది.

వాడు... ఆరెడ్డిగాడు... మడ్డి మొహం వాడూ ...

'నిన్ను చూడ్డమే నాధ్యేయం' అన్న పోజులో తనవేపు ఒకటేధ్యాస. గిరజాలజుత్తు. మూతిమీద నున్నగాగీసిన మీసపుఛాయలు, చెవలకి కమ్మలు-చూడ్డానికి... దూరానికిబాగున్నా. దగ్గర్లోమెదుల్తుంటే కంపరంగా ఉంటోంది.

ఏదైనా నోరువిప్పి మాట్లాడతాడా అంటే... ఊహుఁ - ఏదోతెరిస్తే పేలే నాటుబాంబు నోట్లోఉన్నదన్నంత ప్రమాదంగా — ఎప్పుడూ పెదాలు బిగించే ఉంటాయి.

అన్తమానం బిగిసిన ఆపెదాల ఒరిపిడికేమో - మిరపగింజంత మేరకు తెల్లగా ఉంది.

రోజూ మధ్యాహ్నంవేళకి - వీడికో మగజోడు. కుర్రాడు ఎర్రగాఉంటాడు, 'నీ మీదనే నాకసి' అన్నంత ఉద్వేగంతో నేలమీద టకటకా బూట్ల శబ్దంచేస్తూ నడుస్తాడు. ఎర్రటిముఖంలో మెరిసే కళ్లు, ముచ్చటి మీసం—కొంచెం గుబురుగాఉన్నా - కట్టుమాత్రం కొట్టొచ్చినట్టుంటుంది.

అతగాడు లంచవర్లో ఇతగాడిదగ్గరకు వస్తాడు. ఇద్దరూ 'హరి' తీసిన పొడగాటి సిగరెట్లువెలిగిస్తారు.

ఈమధ్య హరిని తనోకంట కనిపెడుతూనే ఉంది. తనతత్వాన్ని రెడ్డి వీడికి చెప్పిఉంటాడు. పట్టిపట్టి చూస్తున్నాడు.

'వెధవలిద్దరూ బొక్కబోర్లాపడ్డారు!' ఆరోజున వాటర్ క్లోజెట్‌లోని అద్దంలో తనఅందాన్ని పలకరిస్తూ అనుకుంది.

*  *  *

ఆవిడని అందరికీ పరిచయం చెయ్యాలన్నపట్టుదలగా ఓవారం తిరిగాక, మళ్ళీ గుర్రపునాడా న్యూట్రల్‌పాయింట్‌లోఉన్న ఓసెక్షన్‌కి ట్రాన్స్ఫర్ చేశారు.

రెడ్డిగాడి పీడవదిలిందన్నసంతోషంతో సంతకం చేస్తున్న చారి ముందువరసలో కూర్చున్న 'హరి'నీ అతగాడి వేళ్ళమధ్య పొగతోఉన్న పొడవైన ఫిల్టర్ సిగరెట్‌నీ చూసి విస్తుపోయింది.

ఇతగాడికి తెలిసినవాళ్లెవరైనా ఉండి, కావాలనే ట్రాన్స్ఫర్ చేయించుకున్నాడేఁ చెప్మా... అన్న సంశయం కలిగింది.

అదేవరస అక్కడ మడ్డిమొహం రెడ్డిగాడు. ఇక్కడ సిగరెట్‌పొగల్లో, కరకరలాడేచూపుల్తో వీడు.

ధైర్యంలేని వెధవలు—కవర్డ్స్...

ఇక్కడకూడ — మధ్యాహ్నంవేళకి రెడ్డిగారు వస్తున్నాడు—లంచ్ మకాం ఇక్కడే వేస్తున్నారు.

అర్థంకాని భాష... వినపడనిచ్చిచావరు.

ఏవేవో, రూపకాలూ—ఝంపలూ...

'ఏవిటీ—నారూపం, నాచెంపలా—'

ఎవరో తనచెంపలు రెండూచేతుల్తో తవిడి నట్లుగా ఫీలయింది, చలించింది.

ఇక చలించదలచుకోలేదు. ఈపీడ వదిలించ దలచుకుంది ఎలా?! ?!

ఒకే దెబ్బకు రెండుపిట్టలూ విలవిల్లాడాలి కొట్టుకుమరీచావాలి!

* * *

ఆరోజు జాగ్రత్తగా... ఇద్దరికీ వేర్వేరగా... రెండుకవర్లు, రెండు నీలికాగితాలలో వాళ్ళప్యూచరు వివరాలు రాసి పాతసెక్షన్లో పనున్నట్టు వెళ్ళి రెడ్డిగాడి సీటు డ్రాయర్లోనూ, హరి ఆఫీసర్ని చూడ్డానికి వెళ్ళినపుడు—ఇందరి పరధ్యానాన్ని గమనించి, అతగాడి టేబుల్ డ్రాయర్లోనూ—టైంబాంబుల్లా వదిలింది.

అవి ఎప్పుడేనా పేలొచ్చు.

అంచేత హాఫ్‌డే సి. యల్. లో ఆఫీసు వదిలి వెళ్ళింది.

* * *

ఆ మర్నాడు ఆదివారం.

సోమవారం—ఆఫీసుకి—తలంటి పోసుకురావడం వల్ల—ఆలస్యమైంది. రాగానే టేబుల్ సొరుగుతెరిచింది.

తారి గుండెలు అరనిముషంపాటు ఆగి... మళ్ళీ కొట్టుకున్నాయి,

కవరు!

భయంగా చేత్తో వెదికింది. నిస్సందేహం.

ఎవరు తెగిందాడో—లేదా కాంప్రమైజో—

రెడ్డా? హరా?

హరి, రెడ్డి — హరి, రెడ్డి — హరి, రెడ్డి—అంటున్నాయి ఆవిడ గుండెలు వేగంగా,

ఇంతలో క్లాస్ ఫోర్ వచ్చాడు. అటెండెన్సులో సంతకం అంటూ—ఇనిషియల్ ఇన్నివంకర్లుతిరిగింది.

ఆతర్వాత సూపరెంటు గ్రీన్‌బుక్కూ—ఆఫీసరు పైరవీకోసం పిలుపు.

లంచవర్లో మామూలు బాదరాబందీ.

ఆశ్చర్యం! ఆరోజు హరి రాలేదు. లంచవర్లో రెడ్డికూడ మరి ఆచాయల రాలేదు.

ఆసాయంత్రం అసలు తీరికేలేదు. అప్పటికీ టాయిలెట్‌రూంలో కవరుతెరవకబోతే తార ఇకిలిస్తూ కనపడింది. మరి తామరలాగా వదల్లేదు—

వాళ్ళ మూడోవాడి 'డోలారోహణం' వదిహేడో తారీకునట. తప్పకుండా రావాలిట. ఆ అరగంటా ఆ ఆరోహణాన్ని అర్థంచేసుకోడానికి బృహస్పతి తలపుకొచ్చాడు.

ఆసాయంత్రం అందరూ వెళ్ళాక...

ఆఫీసు కాస్తంత ఊపిరిపీల్చుకుంటున్న ప్రశాంత వాతావరణంలో—కవరు తీసింది.

ఇంకా ఏదో జడుసుకుంటూనేఉంది. తీరాచూస్తే 'కిటకిట' లాడుతూ ఊగుతున్న సీలింగ్‌ఫాను.

స్విచ్‌ని — చెమటపట్టిన అరచేత్తో స్పీడ్‌గా నొక్కింది.

ఆటూ ఇటూ చూసి గుండెలదురుతుండగా చదువుకుంది.

టు

ఉబ్బసీద నాంచారమ్మగారికి,

అమ్మా,

విషయం: మీరు మమ్మల్ని ఉమ్మడిగా ప్రేమించ డంగురించి,

రిఫరెన్సు : మీరు మాకు వేర్వేరుగా రాసిన
నీలి ఉత్తరాలు దేబెడ్ మొన్న.

(రిఫరెన్సు-అనేచోట ఎర్రగా నిలువుగీతలు రెండు-పక్కనే వి. యు నీ.- అనికూడా ఉంది.)

—రిఫరెన్సులో ఇచ్చిన ఉత్తరాలలోని వివరాలు పురస్కరించుకొని, మేము చెప్పేదేమిటంటే—

—మీరు మమ్మల్ని విడివిడిగా / ఉమ్మడిగా ప్రేమించే విషయం, తీవ్రంగా, పరిశీలింప బడుతోంది.

—యాదృచ్ఛికంగా-మా, మా సెక్షన్లలో మీరు పనిచేయడం-మా యిద్దరి స్నేహాన్ని-ఉమ్మడిగా సాగిస్తున్న ప్రేమాయణం అని మీరు పొరపడటం చిత్రంగాఉంది. అపార్థంగాఉంది

—నిజం ఇది. మేమిద్దరం, చిక్కడపల్లిలో రోజూ సన్నాయిమేళం సాధన చేస్తుంటాము.

మా సాంగత్యం కేవలం సంగీత పరమయింది. మరే ఇతర అన్వేషణా ఇందులోలేదని గమనించ గలరు.

—వారం రోజులపాటు, కచేరీలకు బెంగుళూరు వెళ్ళుతున్నమేము, వచ్చేలోపల సరైన నిర్ణయము తీసుకుంటామని హామీ యిస్తున్నాము.

ఒ. యస్.

**యు. యస్. చారిగారూ**
**ఉయ్ ఆర్ సారీఫర్‌ది డిలే.**

ఇట్లు
నొక్కుల సన్నారెడ్డి
గంగడోలు నరహరి.

ఉత్తరం తెచ్చిన కల్లోలంలో ... దూరంగా... నాంచారమ్మ కళ్ళముందో దృశ్యం కదిలింది.

తనకి పెళ్ళి !

సన్నాయి ఆకాశంవేపు చూపిస్తూ తన్మయత్వంతో రెడ్డి వాయిస్తున్నాడు.

ముక్తాయింపుల మైకంలో హరి, డోలు కొడుతున్నాడు.

పట్టుచీరలో ఒళ్ళుమరచి మరీ తిరుగుతున్నారు. తన ఆఫీసువాళ్ళే-ముత్తయిదువులందరూ-

క్లాస్‌ఫోర్స్ అంతా యూనిఫారంలో - బ్యాండ్ మేళం వాయిస్తూ పెళ్ళికొడుకుని విడిదినుంచి తెచ్చారు

సూపరెంట్లు సూట్లల్లో తీరికలేకుండా తిరుగుతున్నారు. పురోహితుడు! తన హెడ్‌బాస్ - జంధ్యం సవరిస్తూ తారస్థాయిలో మంత్రోచ్చారణచేస్తున్నాడు.

వధూవరుల మధ్య తెర ఎత్తారు.

పెళ్ళికొడుకు !!!

'అయిదున్నరయినా గట్టనే గూకున్నారే ... గికలెండి' అన్న వాచ్‌మన్, సులేమాను కేకతో ఈ లోకంలోకి వచ్చిపడింది.

అమర్నాడే సెలవుపెట్టిన ఉట్టినీడ నాంచారమ్మ ధారావాహికంగా సెలవును పొడిగిస్తూనే ఉంది, పెళ్ళయిందాకా.

* * *